


ఇప్పుడేమైనా రాస్తున్నారా సార్... అనడిగాడు ఆ వచ్చిన కుర్రాడు రామభూపాలం గారిని.

ఆయనకి సమాధానం ఏమివ్వాలో తోచలేదు. ఎడంచేతి చిటికెన వేలితో మెల్లగా బుర్రగోక్కున్నారు. కళ్ళద్దాల్ని తీసి మెల్లగా చొక్కాతో తుడిచి మళ్ళీ పెట్టుకున్నారు. అయినా ఏం జవాబివ్వాలో తోచలేదాయనకి. కొద్దిగా ఆలోచించారు.

కాన్వెంటు పిల్లలయితే పలకమీద అక్షరాల్ని రాస్తారు. వాళ్లు కొంచెం పెద్దవాళ్లైతే పుస్తకాల్లో హోంవర్కు రాస్తారు. వయసులో ఉన్న వాళ్ళయితే ప్రేమలేఖలు రాస్తారు. ఇంకా చెప్పాలంటే గుమస్తా అయితే పద్దులు, కండెక్టరైతే ఎస్సార్లు, ఇన్‌స్పెక్టర్ అయితే ఎఫ్ఫయ్యార్లు రాస్తారు. ఇలా ప్రతి ఒక్కరూ ఏదో ఒకటి రాస్తూనే ఉంటారు. కానీ వీటిలో ఏ కేటగిరీకి చెందని వ్యక్తి తను. మరి

ఆయన్ని పట్టుకొని రాస్తూన్నారా అంటే ఏం చెబుతారు. అదే మాట ఆ కుర్రాడితో అన్నారు కొంచెం చిరాగ్గా. దానికా కుర్రాడు అదేదో జోకులాగా పెద్ద పెట్టున నవ్వి —

మీ కథల్లోలాగే మీ మాటల్లో కూడా మంచిహాస్యం తొణికసలాడుతోందిసార్... నేనడిగింది మీరు రాస్తూ ఉంటారా చదువుతూ ఉంటారా అని కాదండీ... రాయడమంటే మీరిదివరకు కథలు రాశారు కదా... మధ్యలో కొన్నాళ్లు మానేసి రచనా వ్యాసంగానికి దూరంగా ఉన్నారు. మళ్లీ ఏమైనా రాయడం మొదలు పెట్టారేమోనని... అని నసుగుతూ మళ్లీ తనలో తనే నవ్వుకుంటున్నాడా కుర్రాడు రామభూపాలం గారి ఛలోక్తి మళ్లీ మళ్లీ గుర్తుకు రావడంతో.

ఆఁ... దానికేం తక్కువ లేదులే నాయనా... అంటూ రాగంతీస్తూ కాఫీతో వాళ్ల మధ్యకి వచ్చింది మీనాక్షమ్మ. ఈవిడ రామభూపాలం గారి సహధర్మచారిణి, ఆయన పెళ్లయిన కొత్తలో రాసిన కథలమీద ఎక్కువగా ఈవిడ గారి ప్రభావం కనిపిస్తూ ఉంటుంది.

కాఫీ కప్పుల్ని ట్రే నుంచి తీసి టీపాయ్ మీద పెడుతూ మళ్లీ ఆవిడే అందుకుంది.—

నన్ను కట్టుకోక ముందునుంచి పట్టుకున్నారీయగారు కలాన్ని. ఇదుగో... ఈయనగారికైతే అరవయ్యేళ్లు నిండి ముసలితనం ముంచుకొచ్చేసింది గానీ, ఈయనగారి రచనలకి మాత్రం కొంచెం కూడా జవసత్వాల పట్టు సడలనే లేదంటే నమ్ము నాయనా... ఈయనగారు రాసే కథలను, నవలల్ని చదివే పాఠకుల్లో ఎక్కువ మంది కుర్రకారే... అంటూ ఒక పక్క నిష్ఠూరంగానూ, మరో పక్క తన భర్త ప్రతిభని నర్మగర్భంగా పొగుడుతూ చెప్పి వంటగదిలోకి వెళ్లిపోయింది మీనాక్షమ్మ.

రామభూపాలం గారు వయసులో ఆరు దశకాల్ని చూసినట్టే కథా సాహిత్యాన్ని కూడా దశల వారీగా పోషిస్తూ వచ్చారు. ఆయన చిన్నతనం నాటి నుంటీ మొన్నమొన్నటి వరకూ రచనలు చేస్తూ చాలా కీర్తిగాంచారు. విశ్లేషించి ఎన్నో పరిశోధనలు జరిగాయి. ఎవరో ఒకరు రాడం మీ కథలపై పీహెచ్‌డీ చేస్తునామంటూ ఆయన్ని ప్రశ్నలడగడం. ఆయనకి అలవాటే. ఎంతమంది వచ్చినా విసుక్కోకుండా అతిథి సత్కారాలు చేయడం మీనాక్షమ్మకి పరిపాటే.

ఇప్పుడొచ్చిన కుర్రాడు కూడా ఈయన కథలపై విభిన్న కోణంలో పరిశోధన చేస్తున్నాడట. అందుకే ఈయన ఇంటర్వ్యూ కోసం వచ్చాడు. మరికొన్ని విషయాల్ని రామభూపాలం గారి నుంచిరాబట్టుకొని మీనాక్షమ్మ చేతికాఫి సత్కారాన్ని స్వీకరించి వెళ్లిపోయాడా కుర్రాడు.

* *

ఎన్నో కథలు రాసినా సాహిత్యం గురించి అంతగా పట్టించుకోరాయన. ఇదుగో ఎప్పుడైనా ఎవరైనా వచ్చి ఇలా కదిపితే ఆయన కొద్దికొద్దిగా సాహిత్యం గురించి తన రచనల గురించి ఆలోచిస్తూ ఉంటారు. ఆయన మొన్నే షష్టిపూర్తి మహోత్సవం కూడా జరిగింది. కొడుకు కూతురూ ఘనంగానే చేశారీ వేడుకని. ఈ వేడుక తమదేనన్న అప్యాయతలో సాహితీ సంస్థలు కొన్ని ఈయన్ని ఘనంగానే సత్కరించాయి.



మాయాజాలం చేసే వ్యక్తిని ఓ అమ్మాయి కలిసి ఇలా అంది
'సార్ ! నేను ప్రేమించిన అబ్బాయి నన్ను మోసం చేశాడండీ'
అయ్యో పాపం ! దానికి నేనేం చేయగలనమ్మా !
అడిగాడు మెజీషియన్
'నాకొచ్చిన కడుపు మాయం చేస్తారని' అడిగింది అమ్మాయి.

ఏ.వి. రమణబాబు, శివ
(విజయవాడ)

జీవితాన్ని ఎన్నో రకాలుగా చదివి విభిన్న కోణాలలో మనుషుల్ని విశ్లేషించి కథలు రాసేవారు. కానీ ఎన్ని కథలు రాసినా ఎన్నెన్ని అవార్డు తీసుకొచ్చినా ఏం లాభం? ఎంత పెద్ద కొండయినా అద్దానికి లోకువే కదా... ఈయన ఎంత గొప్ప పేరు ప్రఖ్యాతుల్ని ఆర్జించినా, భార్య కొంతమంది రచయితల పరిస్థితి ఇంతేనేమో. ఇంట్లో పెళ్లాలకి చెప్పలేక, తమ అక్కసునంతా రచనలలో వెళ్లగక్కుతూ ఉంటారు.

రామభూపాలం గారు మాత్రం కథలు రాయడాన్ని చాలా ఇష్టపడేవారు. సమాజానికి కావలసిన మార్పు కోసం తపిస్తూ కూడా రచనలు చేశారు. తన ఉద్యోగ ధర్మాల్ని నిర్వర్తిస్తూనే విశ్రాంతి మాట మాత్రం కూడా లేకుండా రచనలు చేసేవారు. ఎంతో కాలంగా ఎన్నో కథలు రాసినా ఆయనకి తెలియని విషయం ఒకటుంది. ఆ విషయంలో మాత్రం ఈయనకి ఉన్న సందేహం ఇంతా అంతా కాదు. అయితే ఆ విషయం తనకే తెలీదేమోనని దాని గురించి ఆలోచించడం మానేశారాయన. కానీ ఇదుగో ఇలా ఎవరైనా వచ్చి సాహిత్యం, సమాజం, మార్పు ఇలాటి విషయాల్ని చర్చించడం జరిగినప్పుడు మాత్రం ఆయన సందేహం మళ్లీ మళ్లీ రగులుతూ ఉండేది.

అదే సందేహం సరిగ్గా ఇప్పుడు వచ్చింది. ఆ సందేహం ఏమిటంటే కవులు, రచయితలు చేసే రచనల వల్ల సమాజంలో మార్పు వస్తుందా?... ఏమైనా మేలు జరుగుతుందా...? అనేదే సందేహం. ఇది ఆయనకి ఇప్పటికీ తీరలేదు. ఆయన చూస్తే మధ్యయుగానికి చెందినవాడు.

స్వాతంత్ర్యానికి ముందు నుంచీ రచనలు జనాన్ని సమాజాన్ని ఎంతగా ప్రభావితం చేశాయే ఆయనకు తెలుసు. కానీ రానురానూ రచనలు చదవడమే తక్కువయిన ఈ కాలంలో అసలు రచనలు చదివి ఎవరైనా ఏ విధంగానైనా తమ జీవన సరళిలో మార్పు తీసుకొస్తున్నారా లేదా అన్నదే ఆయన సందేహం. అది మాత్రం తీరని కోరికే అయింది. ఆయన విషయంలో.

కానీ ఈ సారి రామభూపాలంగారు ఎప్పటిలా ఆలోచించి వదిలేయలేదా విషయాన్ని ఆలోచించి ఆలోచించి ఏ విధంగానైనా ఆ విషయాన్ని తెలుసుకొని తన ఏకైక సందేహాన్ని నిర్వత్తి చేసుకోవాలనే అనుకున్నారాయన.

ఎలా తెలుసుకోవాలా అని ఆయన ఆలోచించినప్పుడల్లా అనేక మార్గాలు కనిపిస్తుంటాయి. కానీ ఈ సారి ఆయనకి తోచినకాదని ఆయనకి అర్థమయ్యింది. అందుకే దాన్ని కూడా విరమించుకున్నారాయన.

అవును... నిజమే సర్వే చేయడమంటే మాటలా...?! ముందు జనాభా మొత్తంలో అక్షరాస్యులెంతమందో లెక్కగట్టి, వాళ్ళలో మళ్లీ పత్రికలు చదివే అలవాటు ఎందరికుందో తెలుసుకొని, అందునా సాహిత్య పత్రికల్ని చదివే వాళ్లని లెక్కించడం అంటే నిజంగా కష్టమైన పనే... అందుకే విరమించుకున్నారాయన.

కానీ ఆయన సందేహం మళ్లీ మొదటికే వచ్చింది. కనీసం తన కథని ఎవరి చేతనైనాప్రత్యక్షంగా చదివించి వాళ్లు ఎలా రిసీవ్ చేసుకుంటున్నారో తెలుసుకోవాలనిపించిందాయనకి. వెంటనే పెద్దలు చెప్పిన సామెత కూడా గుర్తొంచింది. ఇంటగెలిచి రచ్చ గెలువు అన్న సామెతను బట్టి ముందు ఆ ప్రయోగం తన ఇంట్లోనించే ప్రారంభించాలనుకున్నారు.

వెంటనే పాత పత్రికలన్నీ చకచకా తిరగేసి అందమైన బొమ్మలతో ఆకర్షణీయంగా ఉన్న కథను బయటికి తీస్తారు. ఆ కథ రాసే రోజుల్లో రామభూపాలంగారు మంచి వయసులో ఉన్నారు. ఆ కథ కొద్దిగా కాంట్రావర్సీగా ఉందని, శృంగారం పాళ్లు కొద్దిగా ఎక్కువయ్యాయని, ఆ కథ ప్రచురించిన కాలంలో పెద్ద వివాదం దుమారంలా లేచింది. తన కథను చూపించి, తన కుటుంబ సభ్యులందరి అభిప్రాయాల్ని సేకరించడానికి ఇదే మంచి కథగా అనిపించిందాయనకి.

ఆ కథను తీసుకెళ్లి ముందుగా ఆయన మనుమడు ప్రశాంత్ గదిలోకి వెళ్లారు. ప్రశాంత్ బీఎస్సీ చదువుతున్నాడు. తాతయ్య రావడం చూసి చెవుల్లోని ఇయర్‌ఫోన్స్ బయటికి తీసి, ప్యాంట్‌కి ఫిక్స్ చేసిన వాక్‌మెన్ టేప్ రికార్డర్ని స్టాప్ చేసి ఏంటన్నట్టుగా చూశాడు —తాతయ్య వైపొకసారి.

ఎప్పుడూ నీకిదే గొడవ..?! ఆ దిక్కుమాలిన టేప్ రికార్డరూ నువ్వూనూ... అంటూ చెవుల్లోంచి ఇయర్ ఫోన్స్ లాగిపడేసి,

ఇదుగో ఈ కథ చదువ్.... నేను రాసిందే... చదివి దీనిపై నీ అభిప్రాయం చెప్పు. అర్థమయ్యిందా...? అని నెత్తిమీద ఒక మొట్టికాయ మొట్టి వచ్చిహాల్లో సోఫాలో కూర్చున్నారు.

ఓ పావుగంట తర్వాత ప్రశాంత్ వచ్చి —

"తాతయ్యా... నువ్వు సరసుడవే... ఇలాంటి కథల్ని నువ్వు రాస్తావని నాకెందుకు చెప్పలేదు...? ఈ సారి మళ్లీ ఏమైనా రాస్తే ముందు నాకే చూపించాలి.... ఓ.కే..." అంటూ బయటికి వెళ్లిపోయాడు.

వెళ్లిపోతున్న వాడివైపే చూస్తూ...

అయితే వీడికిందులోని సెక్స్‌ఫిక్షన్ మాత్రమే బుర్రకెక్కిందన్నమాట... అని మనసులోనే గొణుక్కుని... సరే... ఏం చేస్తాం... కుర్రాడు గదా... అని సరిపెట్టుకొని ఈ సారి మనుమరాలు శిరీషకిచ్చాడు తన కథని చదవమని —

కథ చదివిన శిరీష పత్రికని తిరిగి ఇస్తూ—

"ఛీ...ఫో... తాతయ్యా... నువ్వు మరీను... అంటూ సిగ్గులొలికిస్తూ వెంటనే లేడిలా వెళ్లిపోయిందక్కడినుంచి.

శిరీష అభిప్రాయమేంటో అర్థంకాక వెర్రిమొహం పెట్టారాయన.

ఈ సారి తన కొడుకు ప్రసాదరావ్‌ని పిలిచి. యథాప్రకారంగా తన కథ చదివి చెప్పమన్నారు.

ప్రసాదరావ్ మాత్రం తప్పదా అన్నట్టు ఓ చూపు చూశాడు గానీ కథ చదివి దాదాపు తప్పులే పట్టాడు.

ఏంటి నాన్నా మీరు కూడా... ఇలాంటి కథల్ని చదివిన యూత్ ఎలా పాడైపోతుందో తెలుసా... మనింట్లోనూ వయసొచ్చిన పిల్లలున్నారు కదా... చదివితే పాడైపోరూ... అంటూ ఉపన్యాసం దంచేస్తున్న కొడుకుకి ఏం బదులివ్వాలో అర్థం కాలేదాయనికి—

సరే... ఇంత మంది నుంచీ సరైన రెస్పాన్స్ రాకపోయినా తన కోడలు పద్మ నుంచైనా మంచి అభిప్రాయం వస్తుందని భావించి తన కథని ఆమె చేతిలో పెట్టాడు.

పద్మకి విపరీతమైన నవలల పిచ్చి. ఈయన కథ చదివి... అదే మా అభిమాన రచయితయితే ఇంకా రొమాంటిక్‌గా రాసేవాడు.. అంటూ తన అభిప్రాయాన్ని చాలా క్లుప్తంగా చెప్పి, తన నవల చదువుకోవడంలో మునిగిపోయిందామె.

ఇక అందరికీ చూపించాం గదా... పోనీ ఎవరైనా అర్థం చేసుకున్నా తన భార్య మీనాక్షమ్మ గారైనా తనిని మెచ్చుకోకుండా ఉండరని ఆవిడ చేత కూడా కథ చదివించిన రామభూపాలంగారికి పిచ్చతిట్లే తప్ప ఇంకేమీ మిగల్లేదు.

రామభూపాలంగారికి మతిపోయినంత పనయింది. తనేదో తలిస్తే దైవమికొకటి తలిచినట్లు... ఏదో కుటుంబ సభ్యుల స్పందన ఎలా ఉంటుందో తెలుకుందామంటే... అందరి దృష్టిలో ఒక బూతురచయితగా ముద్రవేయించుకున్నానేమిరా ఖర్మ... అని తనని తనే తిట్టుకున్నారాయన.

* *

సరిగ్గా నాలుగు రోజుల తర్వాత—

నిద్రలేస్తూనే ఇల్లంతా ఏదో గందరగోళంగా ఉండటం గమనించారు. ఏమిటా కాకిగోల, పొద్దున్నే కాస్త ప్రశాంతంగా ఉండలేరూ...?! అంటూ హాల్లోకి వచ్చారాయన.

"చూడు తాతయ్యా... ఈ వీక్లీ తెచ్చుకున్నది నేను.. నా దగ్గర్నుంచి లాక్కొంటున్నాడు అన్నయ్య" అంటూ బిక్క మొహం వేస్తూ చెప్పింది శిరీష.

నేను చదివి నీకే ఇస్తాన్లే అంటున్నాడు ప్రశాంత్.

కాదు నేనే ముందు చదవాలి అన్నది శిరీష...

కాదు నేను... ప్రశాంత్

కాదు... నేను...

కాదు... నేను...

వాళ్లిద్దరూ ఇలా దెబ్బలాడుకొంటుంటే కోడలు పద్మ వచ్చి ఆ వీక్లీ నాకిచ్చి మీరిద్దరూ వెళ్లండి... నేను ముందు చదవాలి. అందులో నా అభిమాన రచయిత రాసిన సీరియల్ ఈ వారం నుంచీ ప్రారంభం అవుతోంది అంటూ లాక్కొంది.

ఇంతలో ఈ గొడవంతా వంటింట్లోంచి వింటున్న మీనాక్షమ్మగారు.. ఆ వీక్లీలో ఎవరో డాక్టరుగారు ఏదో సంసారానికి వాటికీ సంబంధించిన ప్రశ్నలకి జవాబులు రాస్తారుట గదా... మీరంతా చదివాకా ఆ వీక్లీ నా మొహాన్న పడెయ్యండి... అంటూ అరుస్తూ చెబుతున్నది.

ఆ వీక్లీ ఈ రోజే మార్కెట్లోకి వచ్చినట్టుంది. అందుకే ఎగబడుతున్నారన్నమాట. ఎప్పుడూ ఇదే గొడవ. కానీ ఇన్నాళ్లు ఆయన పెద్దగా పట్టించుకోలేదు.

తన కథని చదివి శృంగారం అదీ ఎక్కువగా ఉందని పెద్ద లెక్చరర్లు దంచిన కొడుకు కూడా తీరిక సమయాలలో ఆ పత్రిక చదివి ముసి ముసి నవ్వులు నవ్వుకోవడం ఆయన గమనించక పోలేదు.

ఆ పత్రిక వాలకం ఆయనకి ఇది వరకే తెలుసు. ఏవో నాలుగైదు సీరియల్స్, కథలూ, అన్నీ ఉద్రేకం తెప్పించేంతగా శృంగార వర్ణనలతో కూడినవే... దానికి తోడు అర్ధనగ్నపు బొమ్మలు... ఇక సరే... సరి... జనం ఊరుకుంటారా... అలాగే తన కుటుంబ సభ్యులూనూ...

తన కథ అయితే అందరూ నీతులు చెప్పేవాళ్లే. మరి వీళ్లు చేస్తున్నదేమిటి...ష

మనవాళ్లకి మనసు విప్పి మాట్లాడుకోవడం అస్సలు నచ్చదు. ఎవరి హద్దుల్ని వాళ్లే గీసుకుంటూ హద్దుదాటితేనే చెడు అని అంటూ హద్దుల్లోనే చెడ్డబుద్ధులతో కాలం వెళ్లబుచ్చుతున్నారు.

ఒకరి ముందు ఇంకొకరు అసభ్య కరమైన రచనల గురించి బొమ్మల గురించి, మాట్లాడుకోరు. సెక్స్ అంటేనే పెద్ద బూతు. దానిపై చర్చలు అవీ అన్నీ అనవసరమే. దాన్ని గుప్పెట్లో పెట్టి అలా దాస్తూనే ఉంటారు. గుప్పిట్లో ఉన్నదేంటో తెలుసుకోవాలనే కుర్రకారు తప్పులు చేస్తున్నారని మాత్రం తెలుసుకోరు. ఎవరి పరిధుల్ని వాళ్లే సంకుచితం చేసుకుంటున్నారు. నా అంతట నేనే కథ చదివి స్పందన చెప్పమంటే అదేదో పెద్ద బూతు కథ అయినట్టు, నేనేదో పెద్ద బూతురచయిత నయినట్టు ఫోజుపెట్టి, ఒకరిని ఒకరు మోసం చేసుకుంటూ బతుకంతా పెద్ద బూతుతోనే బతుకుతున్నారు వీళ్లంతా.

అవును... సాహిత్యంలో ఇలాంటి విపరీతాలు కూడా ఒకరకమైన కాలుష్యం లాంటివే... ఇది ఇంకా ఎందరి మనసుల్ని కలుషితం చేస్తుందో ఏమో..." అని పరిపరి విధాల ఆలోచిస్తూ మడత కుర్చీలో కూర్చొని వెనక్కి వాలి, కళ్లు మూసుకున్నారు రామభూపాలంగారు. ★



ఒరేయ్ మా చెల్లెల్ని ఓ అరడజను మంది వరసగా ప్రేమిస్తున్నార్ట. వాళ్ళకి ఈ రోజు వార్నింగులు ఇవ్వాలి. నాతోరారా తన స్నేహితుడ్ని పిలిచాడు గౌతమ్
అరడజను మంది ప్రేమిస్తున్నారా ? మిగతా అయిదుగురు ఎవరబ్బా !!
మనసులో ఆలోచించాడు ఉత్తమ్ !

ఏ. వి. రమణబాబు, శివ
(విజయవాడ)